ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

బుధవారం 16 అక్టోబరు 2024

రామగుండంలో రోడ్ల విస్తరణకు చర్యలు షురూ..

కోల్‌సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో రోడ్ల విస్తరణకు చర్యలు షురూ అయ్యాయి. ఇప్పటికే రోడ్ల విస్తరణకు అవసరమైన క్వార్టర్లను తొలగించేందుకు సింగరేణి చర్యలు చేపట్టింది. హనుమాన్‌నగర్, శివాజీనగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో 78క్వార్టర్లను తొలగించనున్నారు. క్వార్టర్లలో నివాసముంటున్న వారికి ప్రత్యామ్నాయ క్వార్టర్లు ఇచ్చారు. క్వార్టర్లను ఆనుకుని నిర్మించిన షెడ్లను తొలగించేందుకు నోటీసులు ఇచ్చారు. మంగళవారం ఎన్‌పీడీసీ ఎల్ ఓల్డ్ అశోక థియేటర్ ప్రాంతంలోని షాపులకు విద్యుత్ కనెక్షన్లను తొలగించింది. కనెక్షన్లు తొలగించడంతో వీటిని కూల్చేందుకు నగరపాలక సంస్థ సన్నద్ధమవుతోంది.



శిశువులతో వైద్యులు, వైద్య సిబ్బంది

ఖని జనరల్ ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో ప్రసవాలు

- 24గంటల్లో 20ప్రసవాలు
- వైద్యులను అభినందించిన సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు

8



గనివద్ద మృతదేహాల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు(ఫైల్)

రేపటితో 8ఏ విషాదానికి 21 ఏళ్లు..

- గని ప్రమాదంలో 10మంది కార్మికుల దుర్మరణం

8

న్యూస్ బాక్స్

స్వయం ఉపాధి దిశగా మహిళలు రాణించాలి

- ఎమ్మెల్యే విజయరమణరావు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధిలో రాణించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు అన్నారు. మంగళవారం పెద్దపల్లి మండల పరిషత్ దుకాణ సముదాయంలో ఐకేపి ఆధ్వర్యంలో ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే విజయ రమణ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే వరకు కళాశాలలను నిరవధిక బంద్‌గా ప్రకటిస్తున్నామని కళాశాలల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా కోఆర్డినేటర్ అల్లెంకి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా జిల్లాలో అన్ని డిగ్రీ కళాశాలలు బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయా కళాశాలల ఎదుట నిరసన తెలియజేశారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు మంజూరు చేయని మూలంగా కళాశాలలన్నీ ఆర్థిక సమస్యల కారణంగా మూసివేసుకునే పరిస్థితి వచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం ఫీజుబకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పత్తికి గిట్టుబాటు ధర దక్కేనా?

- జిల్లాలో పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధం
- పెద్దపల్లి మార్కెట్ సహా 4 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు
- మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న కొనుగోళ్లు



పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న పత్తి కొనుగోళ్లు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు మార్కెటింగ్ శాఖాధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు నాలుగు జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి కొనుగోళ్లు చేపట్టనున్నారు. వ్యాపారులు మద్దతు ధరలకు పత్తిని కొనుగోలు చేయనప్పుడు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) రంగంలోకి దిగనున్నది. నాలుగు జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తిని కొనుగోలు చేయనున్నది. జిల్లాలో ఇప్పుడిప్పుడే మొదటి దశ పత్తి కాపునకు వస్తోంది. మరో వారం రోజుల్లో రైతులు పత్తి ఏరనున్నారు. ఆ తర్వాత రైతులు పత్తిని విక్రయానికి మార్కెట్‌కు తీసుకరానున్నారు. జిల్లాలో ఎనిమిది వ్యవ సాయ మార్కెట్ యార్డులు ఉన్నప్పటికీ, పత్తి కొనుగోళ్లు మాత్రం కేవలం జిల్లా కేంద్రమైన పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోనే పత్తి కొనుగోళ్లు నడుస్తాయి. అడ్తీ వ్యాపారులు నేరుగా కొనుగోలు చేయడమే గాకుండా, ఈ-నామ్ ద్వారా కొనుగోళ్లు సాగుతాయి. అలాగే పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ పరిధి లోగల రెండు జిన్నింగ్ మిల్లుల్లో, సుల్తానాబాద్ మార్కెట్ పరిధిలోని ఒక మిల్, కమాన్‌పూర్ మార్కెట్ పరిధిలోని ఒక జిన్నింగ్ మిల్ వద్ద పత్తిని కొనుగోలు చేయనున్నారు. గడిచిన రెండేళ్లలో పత్తి పంటకు మద్దతు ధర లభించగా, అంతకు మించి ధరలు దక్కలేదు. ప్రతి ఏటా ప్రభుత్వం మద్దతు ధరలు పెంచుతుండగా, అందులో భాగంగా ఈ ఏడాది కూడా పత్తి ధరలు పెరిగాయి. గతఏడాది పొడవు పింజగల పత్తికి క్వింటాలుకు 6,620 రూపాయలు, మధ్య రకం పింజ గల పత్తికి క్వింటాలుకు 6,080 రూపాయలు ఉంది. ఈనెల ఒకటవ తేదీ నుంచి పొడవు పింజ గల పత్తికి క్వింటాలుకు 7,521 రూపాయలు, మధ్య రకం పింజ గల పత్తికి క్వింటాలుకు 7,121 రూపాయల ధర కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గత ఏడాదితో పోలిస్తే పొడవు పింజగల పత్తికి 901 రూపాయలు, మధ్య రకం పొడవు గత పత్తికి 1,041 ధర పెరిగింది. పెరిగిన ధరలు రైతులు ఆశించినవి కాకపోయినా కొంత మేరకు ఊరట కలిగించేవే.



4.70 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా..

జిల్లాలో పత్తి పంట సాధారణ సాగు 67,791 ఎకరాలు కాగా, ఈ సీజన్‌లో 52,887 ఎకరాల్లో పత్తి పంటను రైతులు పండిస్తున్నారు. గత ఏడాది 62,750 ఎకరాల్లో పత్తి పండించగా, ఈ ఏడాది 9,863 ఎకరాల్లో పత్తి పంటకు బదులు ఇతర పంటలను సాగు చేశారు. ఈ సీజన్‌లో సాగైన పత్తి పంట ద్వారా 4లక్షల 71 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. పత్తిలో తేమ 8 శాతానికి మించ కుండా ఉంటేనే మద్దతు ధరలు దక్కే అవకాశాలున్నాయి. నిబంధనల ప్రకారం తేమ ఉన్నా కూడా వ్యాపారులు, జిన్నింగ్ మిల్లర్లు మద్దతు ధరలు చెల్లించకుంటే మాత్రం సీసీఐ నాలుగు జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోలు చేయనున్నదని జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి ప్రవీణ్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సీసీఐ 8 నుంచి 12 శాతం వరకు తేమ ఉన్నా కూడా పత్తి కొనుగోలు చేస్తుందని ఆయన తెలిపారు. గత ఏడాది ఆరంభంలో పత్తికి మద్దతు ధరలకు మించి క్వింటాలుకు 7,500 రూపాయలకు పైగా ధర పలికింది. ఆ తర్వాత తగ్గుముఖం పట్టింది. మళ్లీ చివరలో 8 వేల వరకు పలికింది. అంతకు ముందు ఏడాది క్వింటాలుకు 8 వేల రూపాయలకు తగ్గకుండా ధరలు పలికాయి. ఈ ఏడాది కూడా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు మించి క్వింటాలుకు 8 వేల రూపాయల వరకు ధర పలక వచ్చని అంచనా. జిల్లాలో సాగయ్యే పత్తికి మంచి డిమాండ్ ఉంటుంది. ఇక్కడి నేల స్వభావాన్ని బట్టి పత్తి పింజ పొడవుగా ఉంటుంది. మంచి నాణ్యత కలిగి ఉంటుంది. అందుకే ఇక్కడి పత్తికి మంచి డిమాండ్ ఉంటుంది. మంథని, ముత్తారం, రామగిరి, ఓదెల, కాల్వ శ్రీరాంపూర్ రైతులు ఎక్కువగా జమ్మికుంట మార్కెట్‌లో పత్తి విక్రయిస్తుంటారు. ఎలిగేడు, జూలపల్లి, ధర్మారం రైతులు కరీంనగర్, చొప్పదండి మార్కెట్లలో విక్రయిస్తుం టారు. పెద్దపల్లి, కమాన్‌పూర్, పాలకుర్తి, అంతర్గాం, సుల్తానాబాద్ మండలాల రైతులు ఎక్కువగా జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల వ్యాపారులకు, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో విక్రయిస్తుంటారు. గత ఏడాదికంటే ఈ ఏడాది జిల్లాలో పత్తి సాగు తగ్గుముఖం పట్టిన దృష్ట్యా పంటకు మంచి దిగుబడి ఉంటుందని రైతులు అంచనా వేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పత్తిని మార్కెట్ తీసుకవచ్చి మద్దతు ధరలు పొందాలని మార్కెట్ కమిటీ ప్రథమ శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ రైతులను కోరారు.

విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీల ఏర్పాటు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రణకు విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావే శంలో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాల యాలు, మోడల్ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థల్లో డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగా హన కార్యక్రమాలు నిర్వహించాలని సూచిం చారు. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు అలవాటు ఉన్న వారిని గుర్తించి వారిని పునరావాస కేంద్రాల ద్వారా అలవాటు మానిపించాలని అన్నారు. విద్యా సంస్థల్లో నిర్వహించే పేరెంట్ టీచర్స్ సమావేశాల్లోనూ డ్రగ్స్, గంజాయి విని యోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిం చాలన్నారు. చుట్టుపక్కల ఎవరైనా పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలని కలెక్టర్ సూచించారు. మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గంజాయితో పాటు గుడుంబా నివారణకు సైతం అవసరమైన చర్యలు కచ్చితంగా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స కౌన్సిలింగ్ అందించేందుకు గోదావరిఖని ఆసుపత్రిలో 10 పడకల డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని కలెక్టర్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచిం చారు. చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం దెబ్బ తింటుందని, ఆలోచనా విధానం, ఆలోచనా శక్తి నశిస్తాయని అన్నారు. భావితరాలు మాదక ద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియ జేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ జి క్రిష్ణ, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, డీఎఫ్ఓ శివయ్య, ఎక్సైజ్ శాఖ ఈఎస్ మహిపాల్‌రెడ్డి, డీఈవో డి మాధవి, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటల పరిరక్షణకు కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



సుల్తానాబాద్ చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : అన్యాక్రాంతమైన చెరువులు, కుంటలను పరిరక్షించడానికి కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు.మత్స్య శాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ ఊర చెరువులో వంద శాతం సబ్సిడీతో ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనం తరం ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటల ఆక్రమణకు గురయ్యాయని, దాంతో తమకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయని, వాటిని కాపాడాలని ముదిరాజ్, మత్స్యకార సంఘాల నేతలు కోరుతున్న నేపథ్యంలో తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కొందరి అక్రమణల మూలంగా చెరువులు, కుంటలకే నీరు రాని దుస్థితి ఏర్పడుతుందని, చెరువు శిఖం భూముల్లో ఇల్లు నిర్మించుకోవడం వలన వరద నీరు చెరవుల్లోకి కాకుండా రోడ్ల పైకి చేరుతుందని సుల్తానాబాద్, పెద్దపల్లిలో ఇది తరచూ జరుగుతోందని, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకుంటానని హమీ ఇచ్చారు. అనేక చెరువులు కుంటలు అక్రమణల మూలంగా రోడ్లపైకి వరద నీరు వస్తున్న పరిస్థితిని ప్రతీ వర్షాకాలంలో చూస్తున్నామని అనేక కుంటలు మాయమయ్యాయన్నారు. ఆయా గ్రామాల వారీగా మత్స్యకార, ముది రాజ్‌ల సంఘ సభ్యులు ఆక్రమణల వివరాలను సేకరించి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని, తాను అధికారులతో మాటాడుతూ పర్యవేక్షిస్తానని, ఇక ముందు అన్యాక్రాంతం కాకుండా చూసేందుకు కృషి చేస్తామన్నారు. సుల్తానాబా ద్ చెరువులో అక్రమ నిర్మాణాల వలన నీటి నిలువ సామర్థ్యం, చేపల ఉత్పత్తి తగ్గిపోయి ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని సుల్తానాబాద్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

కాగా, సుల్తానా బాద్ మత్స్య సహకార సంఘ భవన నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని కేటాయించాలని ఈసందర్భంగా ఎమ్మెల్యే తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, పలువురు కౌన్సిలర్లు, జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు కలువల శ్రీనివాస్, గరిగె శ్రీనివాస్, మాదరబోయిన రాజేంద్రప్రసాద్, మాజీ జడ్పీటీసీ మినుపాల స్వరూపప్రకాశ్ రావు, మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్యగౌడ్, పన్నాల రాములు, సాయిరి మహేందర్, రాజ లింగం, తిరుపతి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్య క్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, మండల శాఖ అధ్యక్షుడు చిలుక సతీష్, ఇల్లెందుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 26,27,28 వార్డుల్లో టీయూఎఫ్ఐడీఎస్ నిధుల, ప్యాకేజీ నంబరు 2 ద్వారా 75లక్షల రూపాయలతో బీటీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం, 29, 31 వార్డుల్లో 52లక్షల రూపాయల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణాలకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో కోటి 27 లక్షల రూపాయల నిధులతో రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేసినట్లు, అలాగే దశలవారీగా పెద్దపల్లిలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. పట్టణంలో 30కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు టెండర్లు పూర్తి చేసుకొని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. శంకర్ గంజ్‌లోని ప్రజల సహకారంతో 60 ఫీట్ల వెడల్పుతో డ్రైనేజితోపాటు రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు వివరించారు. పట్టణంలో తాగునీటి సమస్య తన దృష్టికి వచ్చిందని, అమృత్ 2.0 పథకంలో భాగంగా 2 కోట్ల రూపాయలతో వాటర్ సప్లయ్ పనులకు టెండర్లు పూర్తి చేసినట్లు, కొన్ని పనులు ప్రారంభించుకున్నట్లు, తాగునీటి సమస్య లేకుండా చందపల్లి, రంగంపల్లిలో వాటర్ ట్యాంక్ నిర్మాణాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ చివరి నాటికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలో చందపల్లి, రాంపల్లి కాలనీలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు అవసరమైన మౌలిక వసతుల (తాగు నీరు, విద్యుత్, డ్రైనేజీ) కల్పనకు డీఎంఎఫ్‌టీ ద్వారా నిధులు మంజూరు చేశామని, ఈ పనులు డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసి లబ్ధిదారులు గృహ ప్రవేశం చేసే విధంగా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నూతన సంవత్సరం లబ్ధిదారులు కొత్త గృహాలలో జరుపుకునేలా చూడాలని కలెక్టర్ పెద్దపల్లి కమిషనర్‌ను ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా నవంబర్ 30 నాటికి రాంపల్లి, చందనపల్లి కాలనీలకు త్రాగునీటి సరఫరా జరగాలని కలెక్టర్ తెలిపారు. రామగుండంలో 580 డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణం పూర్తయిందని, పెండింగ్ ఉన్న 90 ఇళ్ల చివరి పనులు నవంబర్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నవంబర్ చివరి నాటికి లబ్ధిదారులకు ఇళ్ల అలాట్‌మెంట్ పూర్తి కావాలని ఆదేశించారు. ఓదెల, శ్రీరాంపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పనులకు విద్యుత్ సరఫరా మొదలగు వసతుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఈఈ గిరీష్ బాబు, ఆర్ అండ్‌బీ ఈఈ భావ్ సింగ్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్ తది తరులు పాల్గొన్నారు.

నలుగురిపై కుక్కల దాడి

కోల్‌సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : గోదావరిఖని పట్టణంలోని విఠల్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం వీధి కుక్కలు ఇద్దరు మహిళలపై దాడి చేశాయి. లక్ష్మీభారతి(60) తన ఇంటి ముందు వాకిలి ఇస్తుండగా ఆమెపై దాడి చేసిన కుక్కలు ముక్కును కొరికాయి. అలాగే మరో విద్యార్థినిపై కూడా దాడి చేశాయి. వీరిని గోదావరిఖని ప్రభు త్వాసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు మహి ళలపై కూడా వీధి కుక్కలు దాడి చేసినట్టు తెలిసింది.

మంథని ఆర్డీవో హనుమా నాయక్‌పై వేటు



ఆర్డీవో హనుమా నాయక్

మంథని, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మంథని డివిజన్‌లో విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులపై కలెక్టర్ కోయ శ్రీహర్ష కొరడా ఝుళిపిస్తున్నారు. డివిజన్‌లో ఆకస్మిక పర్యటనలు, తనిఖీలు హడలెత్తిస్తున్న కలెక్టర్ సక్రమంగా విధులు నిర్వహించని అధికారులను సరెండర్ చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో పాలను గాడిన పెట్టే ప్రయత్నాలు సీరియస్‌గా చేస్తున్నారు. తాజాగా మంథని ఆర్డీవో హనుమా నాయక్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంథని డివిజన్‌కు ప్రభుత్వ పాలనపరంగా బాస్‌గా వ్యవహరిస్తున్న ఆర్డీవోపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయనపై సరెండర్ వేటు వేశారు. ఆర్డీవో హనుమానాయక్ అధికార దుర్వినియోగం, నేషనల్ హైవే అథారటీకి భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌తోపాటు సాధారణ ఫిర్యాదులకు హాజరు కావడంలో నిర్లక్ష్యం వహించడం, ప్రభుత్వ అభివృద్ధి పనుల్లో అలసత్వం, కోర్టు ఆదేశాలను పాటించడం లేదని పేర్కొంటూ సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంథని ఇన్‌చార్జి ఆర్డీవోగా పెద్దపల్లి ఆర్డీవో గంగయ్యను నియమించారు. నెల రోజుల క్రితం ఇదే విధంగా విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు మంథని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేసిన మల్లికార్జునస్వామిని సైతం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు కలెక్టర్ సరెండర్ చేశారు. ఆయన స్థానంలో రామగుండం కార్పొరేషన్‌లో మేనేజర్‌గా పని చేస్తున్న మనోహర్‌ను మంథని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు. ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంథని డివిజన్‌లో భారీఎత్తున పలు అభివృద్ధి పనులు, పరిశ్రమలకు, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్, హాస్టల్, మున్సిపల్ భవనం, వెజ్,నాన్‌వెజ్ మార్కెట్స్, వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం మంజూరులు, పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయిస్తున్న క్రమంలో అధికారులు సక్రమంగా పనిచేయకపోవడం వలన భూసేకరణ, నేషనల్ గ్రీన్ ఫీల్డు హైవే నిర్మాణానికి భూసేకరణ, సింగరేణి ఆర్అండ్ఆర్‌తోపాటు ఇతర పనులు ఆశించిన స్థాయిలో వేగవంతంగా కొనసాగకపోవడంతో అధికారుల పనితీరు సరిగా లేదని కలెక్టర్ గుర్తించి తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఇందులో భాగంగా ఆయన వారానికి ఒకసారి మంథని డివిజన్‌లోని మంథని, కమాన్‌పూర్, ముత్తారం, రామగిరి మండాల్లో ఆకస్మికంగా పర్యటిస్తూ.. పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల్లో డివిజన్‌లోని, మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పథకాల అమలు, పనులపై ప్రత్యేక సమీక్షలు నిర్వహిస్తున్నారు. వేగవంతంగా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడానికి పలు శాఖ అధికారులు సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పలు మార్లు హెచ్చరించిన పని తీరు మార్చులేని, పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై కలెక్టర్ సస్పెన్షన్, సరెండర్ వేటు వేస్తున్నారు. కలెక్టర్ చర్యలతో ఇప్పటికే డివిజన్‌లోని వివిధ మండలాల్లో పలు శాఖల అధికారులు అప్రమత్తమై సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారు.

క్రైం కార్నర్

కొండగట్టులో జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన ఈవో
- 'అన్నదానం' సరుకులు చోరీ ఘటనలో చర్యలు

మల్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న నిత్యాన్నపథకంలో వినియోగించే సరుకులు చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిన ఈవో రామకృష్ణరావు అన్నదానం ఇన్‌చార్జి, జూనియర్ అసిస్టెంట్ కె.రాములుపై సస్పెన్షన్ వేటు వేశారు. నిత్యాన్నదానం పథకంలో భాగంగా అన్నదానానికి వినియోగించే 50కిలోల బియ్యంతో పాటు పలు ఇతర సరుకులను ఈ నెల 9న వంటగ్యాస్ సరఫరా చేసే ఆటోలో తరలించిన్నట్లు పలు వురు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆదివారం అన్నదానం ఇన్‌చార్జి రాములుకు మెమో జారీ చేసి 24గంటల్లోపు సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాలలోనూ సరుకుల తరలింపు రికార్డు అయినట్లు అధికారుల పరిశీలనలో తేలడం, ఆటో డ్రైవర్ సురేశ్ వాగ్మూలం మేరకు మంగళవారం రాములను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఈవో పేర్కొన్నారు. గతంలోనూ అతను విధులు నిర్వహించిన చోట కూడా రాములు అన్నదానం సరుకులు మా యం చేసినట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానం నుంచి కొండగట్టుకు బదిలీపై వచ్చారు. రాగానే గతంలో తాను అక్కడ నిర్వహించిన అన్నదానం విభాగం కోసం పైరవీలు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులో భాగంగానే మొదట ఆ విభాగం కేటాయించిన ఉద్యోగిని విధుల్లో చేరక ముందే ఆయనను మార్చి రాములుకు అన్నదానం విభాగానికి అప్పగించారనే విమర్శలు ఉన్నాయి. కాగా రాములు స్థానంలో మరో జూనియర్ అసిస్టెంట్ ధర్మేంధర్‌కు అన్నదాన సత్రం నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

తండ్రిని హత్య చేసిన తనయుడికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భూమి అమ్మకం విషయం లో తల్లిని రాయితో గాయ పరిచి తండ్రిని కర్రతో కొట్టి హత్య చేసిన కేసులో కుమారుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ. 5,000 జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గొల్లపెల్లి మండలం రాపల్లి గ్రామానికి చెందిన గడుగు పోచయ్య తన చిన్న కుమారుడు ప్రభుదాస్‌కు మధ్య భూతగాదాలు ఉన్నాయి. పోచయ్య తన పేరిట ఉన్న రెండు ఎకరాల భూమి అమ్మకం విషయంలో పగ పెంచుకున్న కుమారుడు ప్రభుదాస్ తన తల్లి శాంతను రాయితో కొట్టి గాయపరిచి తండ్రి పోచయ్యను కర్రతో తలపై కొట్టి హత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు గొల్లపల్లి పోలీసులకు 23 నవంబరు 2008న ఫిర్యాదు చేయగా అప్పటి డీసీఆర్‌బీ డీఎస్పీ మహేష్ బా బు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ప్రస్తుత పో లీసులతో పాటు సీఎంఎస్ ఎస్సై రాజు నాయక్, కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్ కుమార్, శ్రీధర్ సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. అదనపు పీపీ మల్లిఖార్జున్ కేసు వాదించగా నేరం రుజువు కావడంతో ముద్దాయి ప్రభుదాస్‌కు జీవిత ఖైదు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

వేములవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజన్న ఆలయం ఎదుట గల ప్రధాన వీధిలో ఉన్న కొబ్బరికాయలు, బెల్లం దుకాణాల్లో తాత్కాలిక కూలీగా పనిచేసే మైత్రి నవీన్ (19) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 27 సంవత్సరాల వయసున్న ఓ వివాహేత పట్ల నవీన్ ఆకర్షితుడయ్యాడు. తాను ఆమెను ప్రేమిస్తున్నానంటూ తరచూ మాట్లాడేందుకు ప్రయత్నించేవాడు. ఈ క్రమంలో సదరు మహిళ బతుకమ్మ పండుగ కోసం ఊరికి వెళ్లగా తనను చూడాలని ఉందంటూ ఫోన్ చేశాడు. ఫోన్ మాట్లాడడానికి ఆమె నిరాకరించడంతో పాటు ఇకముందు తన వద్దకు రావద్దని తనతో మాట్లాడేందుకు ప్రయత్నించవద్దని తేల్చి చెప్పినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో నవీన్ తన చేతిని కోసుకుంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. అనంతరం కనిపించకుండా పోయిన ఆ యువకుడు మంగళవారం నాడు వేములవాడ గుడి చెరువులో శవమై తేలాడు. మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు సదరు మృత దేహం నవీన్‌దిగా గుర్తించారు. గుడి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం కూడా నవీన్ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకోగా కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందించడంతో కోలుకున్నాడు. నెలరోజుల వ్యవధిలోనే రెండోసారి ఆత్మహత్యయత్నం చేసి బలవన్మరణానికి పాల్పడడం చర్చనీయాం శంగా మారింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.



అందమైన అల్లిక..

జగిత్యాల అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల రోడ్డు.. పక్కన ఉన్న ఓ చెట్టు వద్ద అందమైన బుట్టలు అల్లుతూ దంపతులు కనిపిస్తారు. వెదురుతో తయారు చేస్తున్న ఆ బుట్టలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మహిళలు గుడికి వెళ్లేటప్పుడు తీసుకెళ్లే సామగ్రిని ఈ బుట్టలో పెట్టుకుని వెళ్లవచ్చు. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రామా పురం గ్రామానికి చెందిన దేవరకొండ ప్రభాకర్ దంపతులు జగిత్యాల పట్టణంలోని మెడికల్ కళాశాల సమీపంలో రోడ్డు పక్కన ఓ చెట్టు కింద వెదురు బుట్టలు తయారు చేస్తున్నారు. బుట్ట అల్లిక పూర్తయ్యాక వాటికి కలర్ వైరును చుట్టడంతో మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. చాలా మంది వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో బుట్టను 150 రూపాయలకు అమ్ముతున్నారు. దంపతులిద్దరూ రోజుకు ఎనిమిది బుట్టల వరకు అల్లుతున్నారు. ఇవే బుట్టలు బయట దుకాణాల్లో రెం డు వందల రూపాయలకు పైగా అమ్ముతారని, తామే తయారు చేస్తు న్నాం కాబట్టి 150 రూపాయలకే ఇస్తున్నామని ప్రభాకర్ తెలిపాడు.



బుట్ట అల్లుతున్న ప్రభాకర్

ఆటే వారికి ఉపాధి బాట

- ఖోఖో, ఉషు పోటీల్లో నైపుణ్యం
- జాతీయస్థాయిలో ప్రతిభ
- ఒకరికి రైల్వేలో, మరొకరికి ప్రైవేటులో కొలువు
- కోచ్‌లుగా ప్రత్యేక గుర్తింపు

ఇల్లంతకుంట/గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆటలపై ఉన్న ఆసక్తి వారి ఉపాధికి బాటలు వేసింది. జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో కొలువులు సాధించారు. ఉద్యోగాలు చేస్తూనే క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన ఆనంద్, గంభీ రావుపేటకు చెందిన రాణా విక్రమ్ గాంధీ తాము ఎంచుకున్న రంగంలో ఆత్మవిశ్వాసంతో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన పండుగు కనుకవ్వ, నర్సయ్య దంపతుల మూడో కుమారుడు ఆనంద్‌కు ఆటలంటే ఇష్టం. ఏడోతరగతి వరకు వాణీనికేతన్ హైస్కూల్ చదివిన ఆనంద్ అనంతరం జిల్లాపరిషత్ పాఠశాలలో చేరాడు. జిల్లాపరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న అప్పటి వ్యాయామ ఉపాధ్యాయుడు మహేందర్‌రావు పిల్లలకు ఆటలాడిస్తుండగా ఆనంద్‌లోని ప్రతిభను గుర్తించి మెలుకవలు నేర్పించాడు. దీంతో కాకినాడలోని స్పోర్ట్స్ అకాడమీలో సీటు సాధించిన ఆనంద్ పదోతరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేశాడు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్‌లో డిగ్రీ రెండో సంవత్సరం పూర్తి చేస్తుండగానే పలు పోటీలలో సత్తాచాటాడు. ఉమ్మడి జిల్లా నుంచి ఖోఖోలో ప్రతిభ కనబరిచాడు. 2008లో స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం సాధించాడు. స్పోర్ట్స్ కోటాలో 18 సంవత్సరాల వయస్సులో ఉద్యోగం పొందాడు.



సీనియర్ జాతీయ జట్టుకు కోచ్‌గా క్రీడాకారులతో ఆనంద్

ఉత్తమ ప్రదర్శన

ఖోఖోలో ఆనంద్ అనేక సందర్భాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచాడు. సబ్ జూనియర్స్ నేషనల్స్ గ్రామీణ క్రీడల్లో రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించి సిల్వర్ మెడల్ సాధించాడు. నాలుగు సార్లు జూనియర్ నేషనల్స్, యూనివర్సిటీ నేషనల్స్, నేషనల్ గేమ్స్‌తోపాటు ఇన్విటేషన్స్ టోర్నీలో 12సార్లు పాల్గొన్నాడు.

భారత ఖోఖో జట్టుకు నాయకత్వం

నాందేడ్‌లోని సౌత్‌సెంట్రల్ రైల్వేలో ఉద్యోగం చేస్తూ సీనియర్ జాతీయస్థాయిలో వరుసగా ఏడు గోల్డ్‌మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించాడు. 2016లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన 3వ ఏషియన్ చాంపియన్‌షిప్‌లో భాతర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ పోటీల్లో భారత్, మలేషియా, సింగపూర్, కొరియా, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు పాల్గొన్నాయి. సెమీఫైనల్స్‌లో శ్రీలంకపై, ఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌పై 5 పాయింట్లు సాధించి గోల్డ్‌మెడల్ సాధించడంలో ఆనంద్ క్రీయాశీలకంగా వ్యవహరించాడు. నాటి లోకసభ స్పీకర్ సుమిత్రా మహాజన్ చేతుల మీదుగా భారతజట్టు ట్రోఫీ అందుకుంది.

తెలంగాణ జట్టుకు ఖోఖో కోచ్‌గా

నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయిన ఆనంద్ తెలంగాణ సీనియర్ జట్టుకు ప్రస్తుతం ఖోఖో కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఖోఖో క్రీడకు మరింత ప్రాధాన్యం పెంచే క్రమంలో 2018లో తీసుకొచ్చిన అల్టిమేట్ ఖోఖోలో చెన్నై క్విక్‌గన్స్‌టీంకు ప్రాతినిధ్యం వహిస్తూ రాణిస్తున్నాడు.



మాజీ లోకసభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను నుంచి ట్రోఫీ కప్ అందుకుంటున్న ఆనంద్

ఖోఖో క్రీడాకారులకు అవకాశాలు

పండుగు ఆనంద్‌కుమార్, జాతీయ ఖోఖో క్రీడాకారుడు ఇల్లంతకుంట



గతంలో ఖోఖో క్రీడకు అంతగా ప్రాధాన్యం లభించేది కాదు. స్పోర్ట్స్ కోటాలో కేవలం రైల్వేలోనే ఉద్యోగాలు లభించేవి. నేడు పరిస్థితి మారింది. అల్టిమేట్ ఖోఖో రావడంతో అనేక మంది ఖోఖో పట్ల ఆసక్తిని పెంచుకుంటున్నారు. పట్టుదల, సరైన దిశానిర్దేశం ఉంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటాం. భారత జట్టుకు నాయకత్వం వహించడం జీవితంలో మరిచిపోలేనిది. తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయుడు మహేందర్‌రావు ప్రోత్సాహంతోనే ఉన్నతస్థాయికి చేరుకున్నాను.



ఉషు పోటీల్లో శిక్షణ తీసుకుంటున్న రాణా విక్రమ్‌గాంధీ

జాతీయ స్థాయి ఉష్ పోటీల్లో గంభీరావుపేట యువకుడు

పట్టుదల ఉంటే రాణించవచ్చని, ఆటలను ఉపాధికి బాటలుగా మల్చుకోవచ్చని నిరూపించాడు గంభీరావుపేటకు చెందిన క్రీడాకారుడు రాణా విక్రమ్ గాంధీ. వ్యవసాయ కుటుంబ నుంచి వచ్చిన విక్రమ్‌గాంధీ చిన్నతనంలో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాడు. కుంగ్ ఫూ, జూడో, ఫెన్సింగ్, బాక్సింగ్ వంటి క్రీడల్లో రాణించి పలువురి చేత భేష్ అనిపించుకున్నాడు. పద్దెనిమిదేళ్ల వయస్సు నుంచి ఉషు క్రీడపై మక్కువ పెంచుకున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోచ్, జిల్లా ఉషు సంఘం కార్యదర్శి భారా విద్యాసాగర్ వద్ద శిక్షణ తీసుకున్నాడు. ఉషలో మెలకువలను నేర్చుకుని ఉమ్మడి రాష్ట్రంలో కరీంనగర్ తరఫున మూడు రాష్ట్ర, మూడు జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు.

ప్రస్తుతం జాతీయస్థాయి ఉష క్రీడకు కోచ్‌గా వ్యవహరిస్తూ న్యాయ నిర్ణేతగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. 2018లో ఉత్తమ కోచ్ అవార్డును అందుకున్నాడు. ప్రస్తుతం 33 ఏళ్ల వయ స్సు ఉన్న రాణా విక్రమ్‌గాంధీ చొప్పదండిలోని ప్రైవేటు పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. 2011 మార్చిలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం, 2012 మార్చిలో హరిద్వార్‌లో జాతీయ స్థాయిలో రజతం, 2011 అక్టోబర్‌లో హైదరాబాద్ రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం, 2011 డిసెంబరులో పాండిచ్చేరిలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కాంస్యం, 2012 ఫిబ్రవరిలో కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో స్వర్ణం, 2012 మార్చిలో జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో రజత పథకాలు సాధించాడు. అనేకసార్లు రాష్ట్ర ఉష జట్టుకు ప్రాతినిథ్యం వహించి మన్ననలు పొందాడు.

జాతీయ రహదారి పనుల్లో నాణ్యత లోపం

ప్రారంభం కాక ముందే సైడ్ వాల్స్‌కు పగుళ్లు



ఇరుకుల్ల, దుర్శేడ్ గ్రామం మీదుగా రహదారి నిర్మాణం



బ్రిడ్జి సైడ్ వాల్‌కు పగుళ్ళు



నిర్మాణంలోవచ్చిన పగుళ్ళు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే 563 రహదారి పనుల్లో నాణ్యత లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ప్రారంభం కాక ముందే పగుళ్ళు ఏర్పడుతున్నాయి. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామ శివారు లోని మానేరు బ్రిడ్జి సమీపంలో రహదారి పనుల్లో భాగంగా సైడ్ వాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇరుకుల్ల, దుర్శేడ్ గ్రామం మీదుగా బొమ్మకల్ శివారు నుంచి మానకొండూర్ ప్రధాన రహదారికి అనుసంధానంగా ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మానేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో నాణ్యత లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని గ్రామస్థులు అంటున్నారు. సైడ్‌వాల్స్‌కు అప్పుడే పగుళ్లు వచ్చాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కరీంనగర్‌కు రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోట్

మానేరు జలాశయంలో 70 మంది ఫైర్ సిబ్బందికి శిక్షణ



రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోటు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జలాశయాలు, వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించేందుకు కరీంనగర్‌కు ప్రభుత్వం నూతన రిమోట్ ఆపరేటెడ్ లైవ్‌బోయ్ బోటును అందించింది. ఈ రిమోట్ బోయ్ బోట్ ఖరీదు సుమారు 5 లక్షల వరకు ఉంటుంది. వరదనీటిలో, జలాశయాల్లో ప్రమాదంలో ఉన్న వారిని రక్షించేందుకు ఈ లైవ్‌బోయ్ బోటును రిమోట్‌తో ఆపరేట్ చేసి నీటిలో ఆపదలో ఉన్న వ్యక్తి వద్దకు పంపించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చుతారు. ఈ లైవ్‌బోయ్ బోట్‌తో 800 మీటర్ల దూరంలో ఉన్న వ్యక్తిని కూడా రిమోట్ ఆపరేషన్ ద్వారా రక్షించేందుకు అవకాశం ఉంది. ఈ లైవ్‌బోట్ ఆపరేట్ చేసే విధానం, ఆపదలో ఉన్న వ్యక్తులను రక్షించే విధానం, నిర్వహణ తదితర అంశాలపై కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో కరీంనగర్ డివిజన్ అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 70 మంది ఫైర్ సిబ్బందికి మంగళవారం శిక్షణ ఇచ్చారు. కాళేశ్వరం, బాసర, రాజన్న సిరిసిల్ల మూడు జోన్‌లకు సంబంధించిన ఏడు జిల్లాలలోని అగ్నిమాపక సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. రెండు రోజులపాటు ఈ శిక్షణ జరుగనుంది. రాష్ట్ర స్థాయి ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో లైవ్‌బోయ్ బోట్‌ను అందించిన శ్రీలత కంపెనీ ప్రతినిధులు మనోజ్ సావంత్, ఉమేష్ ఫైర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కరీంనగర్ అగ్నిమాపకశాఖ డివిజన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి 20 లైవ్‌బోయ్ బోట్లు మంజూరు కాగా అందులో ఒకటి కరీంనగర్‌కు ఇటీవల వచ్చిందని తెలిపారు. ఈ అధునాతన రిమోట్ ఆపరేటివ్ బోటు నిర్వహణపై ఫైర్ సిబ్బందికి శిక్షణను ఇస్తున్నామని అన్నారు. ఆపదలో ఉన్నవారిని సురక్షితంగా రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, మెలకువలను ఈ శిక్షణలో నేర్పించినట్లు తెలిపారు. ఇప్పటికే విక్టిమ్ లోకేషన్ కెమెరా అందుబాటులో ఉందన్నారు. వరదల సందర్భంలో పాత ఇళ్లు కూలిన సమయంలో శిథిలాల కింద 10 మీటర్ల లోతులో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు ఈ కెమెరాను వినియోగిస్తామన్నారు. ఈ కెమెరాతో శిథాలాల కిందకు చిన్న రంధ్రం ద్వారా కెమెరా కేబుల్‌ను పంపించి పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కెమెరా విలువ దాదాపు 12 లక్షల వరకు ఉంటుందన్నారు.



మానేరు జలాశయంలో శిక్షణ పొందుతున్న ఫైర్ సిబ్బంది

కోరుట్లలో యువకుడి దారుణ హత్య

- పాత కక్షలే కారణం



బోయిన సాగర్ ఫైల్

కోరుట్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రకాశం రోడ్డులో సోమవారం అర్థ రాత్రి యువకుడు దారుణ హత్యకు గురా య్యాడు. ఆదే ప్రాంతంలో ఉండే యువకులు తరచుగా గొడవలకు పాల్పడేవారు. అవే కక్ష లు హత్యకు దారితీసినట్లుగా తెలుస్తోంది. తోటి స్నేహితుడితో వచ్చిన విబేధాల్లో సయో ధ్య కుదుర్చుకునేందుకు ఒక్క ప్రాంతానికి చేరుకున్న యువకుల మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆ గొడవ కాస్త పెద్దదిగా మారి హత్యకు దారితీసినట్లుగా తెలుస్తోంది. పూర్తి వివరాల ప్రకారం పట్టణంలోని ప్రకాశం రోడ్డుకు చెందిన బోయిని సాగర్ అలియాస్ కళ్యాణ్, మంచోడు (32) అదే కాలనీకి చెందిన యువకులతో పాతకక్షలు ఉన్నాయి. సోమవారం సాగర్‌తో తన స్నేహితులతో కలిసి మద్యం తాగుతుండగా కొందరు యువకులు అక్కడి చేరుకుని గొడవ పడ్డారు. వెంటనే గమనించిన చుట్టు పక్కల వారు 100 నంబర్‌కు సమాచారం అందించారు. బ్లూకోట్స్ కానిస్టేబుల్ అక్కడికి వెళ్లి యువకులను సముదాయించి అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. ఈ క్రమంలో రాత్రి 12 గంటల ప్రాంతంలో మరోమారు యువకులు గొడవ దిగారు. ఈ క్రమంలో నలుగురు యువకులతో పాటు మరి కొంత మంది సాగర్‌పై దాడికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. అందులోంచి ఓ యువకుడు కత్తితో సాగర్ మె డపై దాడికి చేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం దాడికి పాల్పడ్డ వారు అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న సీఐ సురేష్ బాబు, కోరుట్ల, కథలాపూర్ ఎస్ఐలు శ్రీకాంత్ నవీన్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సాగర్ తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గత సంవత్సరం క్రితం జరిగిన బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్ సింగ్ హత్య కేసులో సాగర్ నిందితుడు.

చొప్పదండి సహకార సంఘం సందర్శన



చొప్పదండి సహకర సంఘాన్ని సందర్శించిన అధికారుల బృందం

చొప్పదండి, అక్టోబరు15: చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని పశ్చిమ బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ డిసిసిబి బ్యాంకు అధికారుల బృందాలు మంగళవారం సందర్శించింది. క్షేత్ర సందర్శనలో భాగంగా ఈ బృందాలు సందర్శించి సంఘం పనితీరును పరిశీలించారు. రైతులకు అందిస్తున్న పంట రుణాలు, ఎరువుల విక్రయాల గురుంచి అడిగి తెలుసుకున్నారు. సంఘం లాభాల బాటలో పయనించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లక్నో బర్డ్ డీజీఎం రజనీ పాండే, నాబార్డ్ డీడీఎం జయప్రకాశ్, కేడీసీసీ డిజిఎం బ్రహ్మా నందరావు, పీడీసీ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ సంఘం చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, సీఈఓ తిరుపతి రెడ్డి డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయన వ్యవసాయ క్షేత్రాన్నే ప్రయోగశాలగా మార్చుకున్నాడు.. దేశంలోని పలు ప్రాంతాలకు వెళ్లి వివిధ రకాల సాగు పద్ధతులను అధ్యయనం చేశాడు. ఇక్కడి భూములకు అనువుగా ఉండే విధానాన్ని రూపొందించుకుని కూరగాయల సాగును ప్రారంభించాడు. ఇందుకు ప్రభుత్వ ఉద్యోగాన్నీ వదులుకున్నాడు. రాజీనామా పత్రంలోనూ కూరగాయల సాగు చేసేందుకు ఉద్యోగాన్ని వదిలిపెడుతున్నానని రాశాడంటే ఆయన ఎంత ఆత్మవిశ్వాసంతో అటువైపు అడుగులు వేశాడో అర్థం చేసుకోవచ్చు. అందరూ విచిత్రంగా చూసినా.. తను అనుకున్నది సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు తిమ్మాపూర్ మండల కేంద్రానికి చెందిన మాదన కొమురెల్లి. 'ఆంధ్రజ్యోతి'కి ఆయన అనుభవాలను వివరించారు.. - తిమ్మాపూర్, ఆంధ్రజ్యోతి

- నూతన పద్ధతుల్లో సేంద్రియ వ్యవసాయం
- ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి కూరగాయల సాగులోకి..
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధిస్తున్న కొమురెల్లి

వ్యవసాయ క్షేత్రమే ప్రయోగశాలగా..

అనుభవం


డ్రిప్ విధానంలో పండిస్తున్న కొత్తిమీర

నేను సాధారణ కుటుంబంలో జన్మించాను.. చిన్న వయసులోనే వివాహమైంది. ఇంటర్ వరకు చదివాను. అనంతరం టైప్, కంప్యూటర్ కోర్సు చేశాను. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా కానిస్టేబుల్ నోటిఫికేషన్ వచ్చింది. అప్లై చేసుకుని ఉద్యోగం సాధించాను. 1995 నుంచి 1997 వరకు ఉద్యోగం చేశాను. అప్పుడు జీతాలు తక్కువగా ఉండేవి. ఇద్దరు పిల్లలు, భార్యను ఆ జీతంతో పోషించలేక ఇబ్బంది పడ్డాను. ఉద్యోగం చేసినా నా మనస్సు వ్యవసాయం వైపే లాగేది. కూరగాయల సాగు చేయాలని, మన కాళ్లపై మనం నిలబడాలని అనుకునేవాడిని. రెండు సంవత్సరాలు ఉద్యోగం చేసిన తర్వాత ఇక ఆ పనిలో కొనసాగలేనని అనిపించింది. వెంటనే రాజీనామా చేశాను. కూర గాయల సాగు చేసుకునేందుకే రాజీనామా చేస్తున్నానని లేఖలో రాశాను.. అందురూ నవ్వారు. సన్నిహితులు నచ్చజెప్పారు. అయినా వినలేదు. నా లక్ష్యం అదే అనుకుని ముందడుగు వేశాను. రాజీనామా చేసిన తర్వాత మా స్వగ్రామమైన తిమ్మాపూర్‌కు చేరుకున్నాను. మాకున్న మూడెకరాల భూమిలో వ్యవసాయం ప్రారంభించాను.





వినూత్న పద్ధతుల్లో..

మా ప్రాంతంలో ఎక్కువగా వరి సాగు చేస్తారు. అందరికన్నా భిన్నంగా ఉండాలని నేను కూరగాయల సాగును ఎంచుకున్నాను. ఇందుకు చాలా కష్టపడ్డాను. దేశంలో వివిధ ప్రాంతాల్లో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేశాను. ఎక్కడ కొత్త విధానంలో వ్యవసాయం చేస్తున్నారని తెలిసినా అక్కడికి వెళ్లాను. అన్నింటిని పరిశీలించి మన ప్రాంతానికి అనువైన పద్ధతిని రూపొందించుకున్నాను. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలని నిర్ణయించుకున్నాను. నాకున్న భూమిలో అంతా ఒక్క పంట వేయకుండా వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు పండించడం ప్రారంభించాను. మొదట్లో కొంత కష్టమైనా ఇష్టంగా పని చేశాను. తర్వాత అలవాటైంది. మొదటి రెండు సంవత్సరాలు చిన్నచిన్న ఇబ్బందులు ఎదురైనా ధైర్యంతో వాటన్నింటిని అధిగమించాను. కూరగాయల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చు. ప్రణాళికా ప్రకారం సాగు చేస్తే నెలవారీగా ఆదాయం పొందవచ్చు.

ఎనిమిది మందికి ఉపాధి

ఒకప్పుడు కుటుంబసభ్యులం కష్టపడే వారం. రానురాను పంటలు పెరిగేసరికి ఇతరుల సహాయం తీసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం మాతో పాటు ఎనిమిది మంది పని చేస్తున్నారు. నా భార్య అరుణ అన్ని పనుల్లో నాకు చేదోడు.. వాదోడుగా ఉంటుంది. నాకు ఇద్దరు కుమార్తెలు. పెద్దమ్మాయికి వివాహం జరిగింది. చిన్నమ్మాయి బెంగళూర్‌లో ఉద్యోగం చేస్తోంది. నేను పండించే పంటను మార్కెట్‌లో విక్రయిస్తా.

వ్యవసాయం చేయాలంటే ఓపిక అవసరం


పంటను మార్కెట్‌కు తరలిస్తున్న రైతు కొమురెల్లి

వ్యవసాయం చేయాలంటే ఓపిక అవసరం. కూరగాయల సాగుతో మంచి లాభాలు ఆర్జించవచ్చు. కొత్తగా వ్యవసాయంలోకి వచ్చే రైతులు అవగాహన వచ్చే వరకు ఎక్కువ పెట్టుబడులు పెట్టొద్దు. తక్కువ విస్తీర్ణంలో తక్కువ పెట్టుబడి పెట్టి వ్యవసాయం ప్రారంభించాలి. అవగాహన వచ్చిన తర్వాత విస్తీర్ణాన్ని పెంచుకోవాలి. అప్పులు తెచ్చి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి ఇబ్బందులు పడొద్దు. చాలా మంది రైతులు సేంద్రియ పద్ధతులు అంటే పెట్టుబడి ఎక్కువ పెట్టి పండిన పంటలను ఎక్కువ ధరకు విక్రయిస్తారు. నేను సాధ్యమైనంత తక్కువ పెట్టుబడితో సాగు చేస్తాను. వినియోగదారులకు తక్కువ ధరకే అమ్ముతాను.

శాశ్వత పందిరి

కూరగాయల సాగులో ఎప్పటికప్పుడు సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాల్సి ఉంటుంది. నూతన పద్ధతులను గమనించాల్సి ఉంటుంది. నేను పెండల్స్, జేఐ వైర్ సహాయంతో నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల వరకు పెట్టుబడి పెట్టి శాశ్వతంగా ఉండేలా పందిరి వేశాను. అంతకు ముందే ఎరువులు వేసుకుని మళ్లు ఎత్తుగా తయారు చేసుకున్నాను. మల్చింగ్ విధానంలో విత్తనాలు వేశాను. బిందు, తుంపర్ల విధానంలో మొక్కలకు నీటిని అందిస్తున్నాను. ఇది మంచి ఫలితాన్ని ఇస్తోంది. మంచి దిగుబడి వస్తోంది. ప్రస్తుతం టమాట, బీర, మిర్చి, కాకర పంటలు పండిస్తున్నాను. కొత్తిమీర, ఇతర ఆకు కూరలు సాగు చేస్తున్నాను. వాతావరణ, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పంటలను మార్చుతుంటాను. సంవత్సరానికి ఒక పంట తీసే టమాట, మిర్చికి మూడు లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ఆదాయం వస్తుంది. బీర, కాకర సంవత్సరానికి రెండుసార్లు పండుతాయి. ఒక్కో పంటకు రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడులు పోను ఏడాదికి 15 లక్షల రూపాయల వరకు సంపాదిస్తున్నాను. ప్రస్తుతం ఎకరం విస్తీర్ణంలో మిరప, ఎకరం టమాట, రెండు ఎకరాల్లో పందిరి కూరగాయలైన బీర, కాకరకాయలు, 20 గుంటల్లో కొత్తిమీర సాగు చేస్తున్నాను. వీటితోపాటు అంతరపంటలు సాగు చేస్తున్నాను. పందిరిపై ఉన్న పంట తీసివేసే సమయానికి ఎదిగేలా అంతర పంటలు వేస్తున్నా. అవి చేతికొచ్చే సమయానికి పందిరి కూరగాయాలు విత్తుకుంటాను. ఈ విధానం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు.


మల్చింగ్ విధానంలో సాగు చేస్తున్న టమాట


కొమురెల్లి సాగు చేసిన కాకర కాయ పంట


తీగజాతి సాగు కోసం వేసిన శాశ్వత పందిరి

క్రీడా సమాచారం

18న ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 18న నిర్వహించనున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల ఎదురుగా గల కేడీసీఏ కార్యాలయ ఆవరణలో ఈ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే 60 మంది క్రీడాకారులను మొదటి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేసి అందులోంచి 15 మంది క్రీడాకారుల చొప్పున నాలుగు జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ జట్లకు పోటీలు నిర్వహించిన ఆ మ్యాచ్‌లో విశేష ప్రతిభచాటే క్రీడాకారు లను ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక చేయనున్నామని వారు తెలిపారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు నవంబర్‌లో మెదక్, వరంగల్ జిల్లాల్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. 1-9-2001 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. అర్హత గల క్రీడాకారులు రెండు ఫొటోలు, జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షులు కె మహేందర్‌గౌడ్, పి మనోహర్‌రావులకు రిపోర్టు చేయాలని సూచించారు.

20న ఉమ్మడి జిల్లా జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉమ్మడి జిల్లా జూనియర్ ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈ పోటీలను ఉదయం 9 గంటల నుంచి బాల బాలికల విభాగంలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి జూనియర్ ఖో-ఖో పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 22-11-2006 తర్వాత జన్మించినవారై ఉండాలని పేర్కొన్నారు. క్రీడాకారులు ఎస్సెస్సీ మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని ఆయన సూచించారు.

రూ.6,900 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,900 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 30మంది రైతులు 172క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6,900, కనిష్ఠ ధర రూ.6,100 పలికింది.

అండాళమ్మకు ఒడిబియ్యం

- లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు


పట్టువస్త్రాలతో మున్సిపల్ చైర్‌పర్సన్, పద్మశాలి సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం అండాలమ్మ వారికి మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు తరలివచ్చి ఒడిబియ్యం సమర్పించుకున్నారు. అనంతరం లక్ష్మీవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పద్మావతిదేవి అమ్మవారికి ఒడిబియ్యం, పట్టు వస్త్రాలను సిరిసిల్ల పద్మశాలీ సంఘం ప్రతినిధులు సమర్పించారు. మార్కండేయ స్వామి దేవాలయం నుంచి ఒడిబియ్యంతో వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు పూర్ణచందర్, గుజ్జె తార, కాముని వనిత, అడెపు రవీందర్ పాల్గొన్నారు.

బర్నింగ్ ఇష్యూ

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిరవధిక బంద్

- మూడేళ్ల ఫీజు బకాయిలు చెల్లించాలని యాజమాన్యాల డిమాండ్
- ఉద్యమానికి సిద్ధమవుతున్న విద్యార్థి సంఘాలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తమకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాలు కళాశాలల నిరవధిక బంద్ నిర్వహిస్తున్నాయి. ఈ నెల 14 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 60 డిగ్రీ కళాశాలలు, 35 పీజీ కళాశాలలు నిరవధిక బంద్ పాటిస్తున్నాయి. రెండు రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రకపోవడంతో విద్యార్థులు, లెక్చరర్స్, విద్యార్థి సంఘాల నేతలు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఉమ్మడి జిల్లా జిల్లా వాప్తంగా 120 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి.



జగిత్యాలలో మూసివేసిన డిగ్రీ కళాశాల

- **కష్టంగా మారిన నిర్వహణ**

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడిన యాజమాన్యాలు ప్రైవేట్ కళాశాలలు నడుపుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఖర్చులన్నీ యాజమాన్యాలు భరించాల్సి వస్తోంది. మూడేళ్లుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలకు సిబ్బంది జీతాల చెల్లింపు, కాలేజీల నిర్వాహణ భారంగా మారింది. నెలల తరబడి వేతనాలు అందక ఆయా కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో దీక్షలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కాలేజీల యాజమాన్యాలు నిరవధిక బంద్ నిర్వహిస్తున్నాయి.

- **విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి**

చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘ నాయకుడు



ఫీజు బకాయిల కోసం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ వాల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అకడమిక్ వాతావరణం దెబ్బతినే అవకాశం ఉంది. సెమిస్టర్ పరీక్షలకు ఇబ్బంది కలుగుతుంది. ఫీజు బకాయిల విషయంలో ప్రభుత్వం వేంటనే స్పందించాలి. లేకపోతే ఉద్యమాలు నిర్వహిస్తాం.

- **ప్రభుత్వం స్పందించాలి**

వెంకటేశ్వర్రావు, డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



తప్పని పరిస్థితుల్లో నిరవధిక బంద్‌కు వెళ్లాల్సి వచ్చింది. మా ఉద్దేశ్యం విద్యార్థులను ఇబ్బంది పెట్టాలన్నది కాదు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇస్తేనే కళాశాలలు మనుగడ సాగించగలు గుతాయి. విదార్థులు, కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది, కుటుంబాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించాలి.

- **విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి**

- కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ డిగ్రీ ,పీజీ కళాశాలల యాజమాన్యాలపై ఆర్థిక భారం పడుతోంది. కళాశాలల బంద్‌తో సెమిస్టర్ పరీక్షలు ఆలస్యయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

కల.. సాకారమవుతున్న వేళ..!

- వంతెన నిర్మాణంతో రామారావుపల్లె, ఇటిక్యాల గ్రామస్థుల హర్షం


పూర్తయిన వంతెన

రాయికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని రామారావుపల్లె-ఇటిక్యాల పెద్ద వాగుపై వంతెన పనులు తుది దశకు చేరాయి. రామారావుపల్లె గ్రామంలో సుమారు 120 కుటుంబాలు 530 జనాభా ఉంది. గ్రామస్థులు తమ అవసరాలకు నిత్యం రాయికల్ మండలానికి లేదా పక్కనున్న ఇటిక్యాల గ్రామానికి వెళ్లాలంటే మధ్యలో గోదావరి పెద్ద వాగు ఉండటంతో చుట్టూ సుమారు 10 కి.మీ. దూరం తిరిగి వెళ్తున్నారు. దశాబ్దాల నాటి నుంచి ఈ వాగుపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదించినా నిధులు మంజూరు కాక ప్రజలు అవస్థలు పడ్డారు. ఎట్టకేలకు రెండేళ్ల క్రితం వంతెన, ఇరువైపులా రహదారి నిర్మాణానికి రూ.9 కోట్లు మంజూరు కాగా పనులు ప్రారంభమయ్యాయి. బిల్లులు రాక పనులు మధ్యలో ఆగిపోగా, జనవరిలో మళ్లీ ప్రారంభించారు. పెద్ద వాగుపై 280 మీటర్ల మేర 16 పిల్లర్లపై స్లాబులు పూర్తయ్యాయి. మరో మూడు మాసాల్లో వంతెన అందుబాటులోకి రానుండటంపై ఇరు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అనంతగిరి నుంచి చిత్రపురికి

అసిస్టెంట్ కెమెరామన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణింపు


సినిమా చిత్రీకరణలో బాలకిషన్

ఇల్లంతకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో లక్ష్యసాధనకు కృషి చేస్తే సాధ్యం కానిదేమీ లేదని నిరూపిస్తున్నాడు ఇల్లంతకుంట మండలం అనంతగిరి కుర్రాడు. కళాకారుడిగా ఎదిగి స్థిరపడాలనే ఆశయంతో నిరంతరం శ్రమించాడు. లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంగా ముందుకు సాగుతున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరికి చెందిన తిప్పరవేని మల్లమ్మ, రాజయ్య దంపతుల కుమారుడు బాలకిషన్‌కు చిన్నతనం నుంచి నాటకరంగంపై ఆసక్తి. మండలంలోని పలు గ్రామాల్లో నాటకాలు వేసినప్పుడు చిన్నచిన్న పాత్రలు పోషించే వాడు. దానికి తోడు ప్రకృతిని తన కెమెరాలో బంధించడం అలవాటుగా మార్చుకున్నాడు. సినీ రంగంలో అవకాశాలు వెతుక్కుంటూ 15 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. అనేక ప్రయత్నాల అనంతరం 2005లో నటుడు శ్రీకాంత్ హీరోగా నటించిన 'శ్రీకృష్ణదేవరాయ' సినిమాకు తొలిసారిగా అసిస్టెంట్ కెమెరామెన్‌గా పని చేశాడు. అనంతరం బాస్, స్టూడెంట్ నంబర్ 1, ఇంద్రాక్ష, తొలిపరిచయం, వారిధి వంటి సినిమాలకు పనిచేసి మంచి గుర్తింపు పొందాడు. ప్రభాస్ నటించిన 'మిర్చి' సినిమా వీడియో మేకింగ్ చేశాడు. 2016లో అన్నపూర్ణ బ్యానర్‌పై నిర్మించిన టీవీ సీరియల్ 'శశిరేఖ పరిణయం'కు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాడు. 'పసిడి మొగ్గలు, జోగిని, వేడుకలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణించాడు.

2014లో హరితహారంపై బాలకిషన్ తీసిన డాక్యుమెంటరీకి తెలంగాణ ప్రభుత్వం నుంచి మొదటి బహుమతి లభించింది. ఇటీవల కాలంలో యూట్యూబ్‌లో పలు పాటలు, సామాజి క అభివృద్ధి అడ్డంకిగా మారిన అం శాలపై దృష్టి కేంద్రీకరించాడు. స్థానిక కళాకారులతో షార్ట్‌ఫిలిమ్స్ తీస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మపై తీసిన పాట ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇలా సినిమాలు, యూ ట్యూబ్ చానల్ లో బాలకిషన్ తనదైన శైలిలో రాణిస్తున్నాడు.


సినిమా షూటింగ్‌లో బాలకిషన్

సినిమారంగంలో రాణిస్తా

బాలకిషన్ తిప్పరవేణి, నటుడు, కెమెరామెన్, ఇల్లంతకుంట

సినిమారంగంలో ఇప్పటికే పలు చిత్రాలకు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశాను. టీవీ సీరియల్స్‌లో ఆర్టిస్టుగా పనిచేశాను. సినిమారంగంలో రాణించడమే లక్ష్యం. అనేక ఇబ్బందులు ఎదుర్కొని ముందుకు సాగుతున్నా. స్థానిక కళాకారులతో యూట్యూబ్‌లో పాటలు, షార్ట్‌ఫిలిమ్స్‌తో మంచి గుర్తింపు లభిస్తోంది. అనంతగిరి గ్రామస్థులు, తల్లి దండ్రుల సహకారం మరువలేనిది.

న్యూస్ బాక్స్

రేపు జిల్లా స్థాయి పోటీలు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష తెలంగాణ నుంచి గత నెల మండల స్థాయి గెలుపొందిన విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీలు ఈనెల 17న జిల్లా కేంద్రంలోని ఏంఆర్‌సీలో నిర్వహిస్తారని డీఈవో మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రథమ స్థానం సాధించిన వారు నవంబర్ 1న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

విరాళ సేకరణ కమిటీ

ఓదెల, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఊర పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం మంగళవారం విరాళ సేకరణ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామంలో 2500 రేషన్ కార్డులకు ఒక్కో రేషన్ కార్డుకు రూ.2వేల చొప్పున విరాళాలు సేకరించాలని నిర్ణయించారు. అన్ని కులాల పెద్దలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శుభ్రతపై అవగాహన

ఓదెల అక్టోబర్ (ఆంధ్రజ్యోతి) 15: గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేలో భాగంగా మంగళవారం మండలంలోని కొలనూర్ హైస్కూల్‌లో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అలాగే వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఏసుదాసు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

'కమిటీలను వేయండి'

ఎలిగేడు, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం లబ్ధిదారుల ఎంపికకు వేసిన ఇందిరమ్మ కమిటీలు పారదర్శకంగా ఉండేలా చూడాలని మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భైరెడ్డి రాంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 12గ్రామాల్లో ఇళ్లులేని అర్హులైన నిరుపేదలను గుర్తించి ఎంపిక చేయాలని వారు సూచించారు.

వాటర్ కూలర్ విరాళం

జూలపల్లి, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు వాటర్ కూలర్‌ను అందజేశారు. దాతలతో పాటు ఆలయ అభివృద్ధి నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



ఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు మంగళవారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సంజీవ్ పూలమాల వేసి మాట్లాడారు. పేపర్‌బాయ్ నుంచి దేశానికి రాష్ట్రపతికి ఎదిగిన ఆయన జీవితం అందరికి ఆదర్శమన్నారు. ఆయన జన్మదినాన్ని యుఎన్‌వో అంతర్జాతీయ విద్యార్థి దినోత్సవంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జీడీ కనకయ్య, అధ్యాపకులు అబ్దుల్ రహమాన్, మంథెన శ్రీనివాస్, కుక్కుడపు శ్రీనివాస్, శంకరయ్య, కమలాకర్, శ్రీనివాస్, శంకరయ్య, శాంతారామారావు, శారద, కలరాధా, శ్రీగోదా, జగదీశ్వరి, రమాదేవి, స్వప్న, ప్రియదర్శిని, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో స్థానిక మార్కండేయకాలనీలో ఏపీజె అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు శంకర్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కమ్ ట్యాక్స్ ఆడిటర్ ఎండి ఇబ్రహీం, నాయకులు బుద్దే గోవర్ధన్, బోళ్ల చంద్రశేఖర్, జనగామ శరణ్‌బాబు, మాదరబోయిన శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో మంగళవారం భారత అణుశాస్త్ర పితామహుడు, భారత మాజీ రాష్ట్రపతి స్ఫూర్తిప్రధాత భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను పార్టీలకు అతీతంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, కాంగ్రెస్, బీఆర్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, భైరెడ్డి రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ మండిగా రేణుకరాజనర్సు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, బూర్ల వెంకటసత్యం, మామిడాల రమేష్, సింగిరెడ్డి రాంరెడ్డి, చంద్రరెడ్డి, అమ్ముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాంను యువత, విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం పెద్దపల్లి అమరవీరుల స్థూపం వద్ద పేపర్ డిస్ట్రిబ్యూటర్స్ ఏజెంట్స్ ఆధ్వర్యంలో ఏపిజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి ఎమ్మెల్యే పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, సాబీర్ పాష, రాజయ్య, సంతోష్, రాజు, చారిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఓపీ విధులను వైద్యులు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ విధులను వైద్యులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. అవుట్ పేషెంట్ రిజిస్ట్రేషన్ కౌంటర్లు, వార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఔట్ పేషంట్ చాంబర్‌లలో లిస్ట్‌లో పేర్కొన్న ప్రకారం నలుగురు వైద్యులు 10:40నిమిషాలకు అందుబాటులో లేకపోవడానికి గల కారణాలను కలెక్టర్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. వివిధ డాక్టర్లు ఏ రకమైన లీవ్‌లో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు లీవ్స్ గురించి ముందుగా సూపరింటెండెంట్‌కి ఇన్ఫర్మేషన్ ఇచ్చి సాంక్షన్ చేయించుకోవాలని తెలిపారు. విధులకు హాజరుకాని వైద్యులు తనను కలెక్టరేట్లో సాయంత్రం 4గంటలకు కలవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ఔట్ పేషెంట్ విధులను వైద్యులు పకడ్బందీగా నిర్వహించాలని, విధుల సమయంలో వైద్యులు ప్రైవేట్ హాస్పిటల్ నిర్వహిస్తున్నట్టు తెలిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్‌ఎంవో డాక్టర్ రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్

ఖని జనరల్ ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో ప్రసవాలు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవారం రికార్డు స్థాయిలో ప్రసవాలు జరిగాయి. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మంగళవారం ఉదయం 9గంటల వరకు 20మంది గర్భిణులకు పురుడు పోశారు. గైనిక్ విభాగం హెడ్ అరుణశ్రీ, వైద్యులు స్రవంతి, వెంకట లక్ష్మి, శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రసావాల్లో 12మంది ఆడశిశువులు, 8మంది మగ శిశువులు ఉన్నారు. రికార్డు స్థాయిలో ప్రసవాలు చేసిన వైద్యులను సింగరేణి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, జనరల్ ఆసుపత్రి సూప రింటెండెంట్ దయాల్ సింగ్ అభినందించారు.

ఓడేడులో ఈజీఎస్ పనులపై గ్రామసభ

ముత్తారం, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీ పరిధిలో ఈజిఎస్ పనులపై మంగళవారం ఎంపీడీవో సురేష్ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చే వార్షిక సంవత్సరానికి ఏర్పాటు చేసుకునే పనులను గుర్తించారు. వాటిపై చర్చించి ఈజిఎస్ ద్వారా పనులు చేసేందుకు తీర్మానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఆశలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

ముత్తారం, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : మంథని మండల కాకర్లపల్లి గ్రామానికి చెందిన మీరాల సతీష్‌కు చెందిన సుడి గొర్రె విద్యుదాఘాతంతో మృతిచెందింది. మంగళవారం ముత్తారం మండలం రామకృష్ణ(ఇప్పలపల్లి) శివారులో గొర్రెలు మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మృతిచెందింది. విద్యుత్ అధికారులు తనకు నష్టపరిహారం ఇప్పించాలని బాధితుడు కోరారు.

గాయత్రి విద్యానికేతన్‌లో యాంబిషన్ డే



వివిధ వేషధారణల్లో విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌లో యాంబిషన్ డేని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణల్లో అలరించారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, సృజన, స్రవంతి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు

రామగిరి, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం రైతు వేదికల ద్వారా ప్రతి మంగళవారం రైతు నేస్తం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది, మండలంలోని రత్నాపూర్ రైతువేదికలో మంగళవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధకులు, వ్యవసాయ శాఖ అనుసంధానంతో రైతులకు పలు సూచనలు అందజేశారు. అందులో భాగంగా టి-ఫైబర్ సేవలను వినియోగించుకోవాలని ఢిల్లీలో ఏర్పాటు చేసిన టి-ఫైబర్ సమ్మిట్‌నీ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభిస్తూ రత్నాపూర్ రైతువేదికలో ఉన్న అధికారులు, రైతులతో మాట్లాడి టి-ఫైబర్ సేవల గురించి అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంథని ఏడీఏ అంజనీ,కేవికే శాస్త్రవేత్తలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

రామగుండానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

● ఈనెల 23న ప్రారంభం?

కోల్‌సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రామగుండంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సేవలందించేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం పెద్దపల్లిలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రామగుండం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణానికి తరలించనున్నారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ రామగుండం పట్టణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న రామగుండం ఎంపీడీవో కార్యాలయన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా మార్చారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష కార్యాలయ వసతులకు సంబంధించి చొరవ తీసుకున్నారు. కొత్తగా కంప్యూటర్లు, ఫర్నీచర్లు సమకూర్చడమే కాకుండా భవనాన్ని మరమ్మతులు పూర్తి చేశారు. 2023ఏప్రిల్ 1వ తేది నుంచి ఈ కార్యాలయం పెద్దపల్లిలో కొనసాగుతున్నది. రామగుండానికి తరలించేందుకు సరైన భవనం అందుబాటులో లేని కారణంగా పెండింగ్‌లో పెట్టారు. ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రామగుండం నగరపాలక సంస్థ, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. ప్రస్తుతం పెద్దపల్లికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రామగుండంలో కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల కొనుగోళ్లు, అమ్మకాల రిజిస్ట్రేషన్లు, మార్టిగేజ్‌లు, మ్యారేజ్ రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రిలీజ్‌లు తదితర లావాదేవీలకు సౌకర్యవంతంగా ఉంటుంది. పెద్దపల్లి సబ్ రిజి స్ట్రార్ కార్యాలయ పరిధిలో రామగుండం ప్రాంతం నుంచి 60శాతం రిజిస్ట్రేషన్లు జరిగేవి. కార్యాలయం రామగుండంకు తరలించడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు సౌకర్యంగా ఉండడంతో పాటు రామగుండం పట్టణంలో మరో కార్యాలయం అందుబాటులో ఉన్నట్టు ఉంటుంది. ఈ నెల 23న కార్యాలయాన్ని తరలించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



రామగుండంలో ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

యోగా మాస్టర్‌ను అభినందించిన చిన్న జీయర్ స్వామి


కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యోగా, కరాటే, కవితలు తదితర మంచి పుస్తకాలు రాసి ప్రజలకు అందించినందుకు యోగా మాస్టర్ సంపత్ కుమార్‌ను మంగళవారం చిన్న జీయర్‌స్వామి కొనియాడినట్లు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సారయ్య గౌడ్ మాట్లాడుతూ కాల్వశ్రీరాంపూర్‌లో 14సంవత్సరాలు పీఈటీగా పనిచేసే ఎందరో విద్యార్థులను యోగా, కరాటే, కబడ్డీ పలు క్రీడల్లో నిష్ణాతులు చేశారన్నారు. సంపత్ కుమార్ రచించిన విశ్వమంగళ యోగా గ్రంథాన్ని మునిచింతల్‌లోని ఆశ్రమంలో త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి, త్రిదండి చిన్న జీయర్ స్వామి పరిశీలించి ప్రశంసించారన్నారు. సాహిత్య రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

73 మంది టీచర్లకు కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్స్

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి కల్చరల్, అర్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని డీఎస్సీ పరీక్ష ద్వారా ఎంపికైన 73 మంది నూతన టీచర్లకు పోస్టింగ్స్ కేటాయించడం జరిగిందని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం కలెక్టర్ కోయ శ్రీ హర్ష కలెక్టరేట్‌లో నూతన టీచర్లకు పోస్టింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్ష ద్వారా నూతనంగా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్, వ్యాయామ ఉపాధ్యాయులకు రాష్ట్ర ముఖ్యమంత్రి అక్టోబర్ 9న నియామక పత్రాలు అందజేయడం జరిగిందని తెలిపారు. కలెక్టరేట్లో ఎంపికైన 73 మంది నూతన టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ కేటాయించడం జరిగిందని, వీరు అక్టోబర్ 16 న కేటాయించబడిన పాఠశాలలో జాయిన్ కావాల్సిందిగా కలెక్టర్ సూచించారు. జడ్పీ సీఈవో సమక్షంలో పోస్టింగ్స్ కేటాయించామని అన్నారు. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కింద 6 బయలాజికల్ సైన్స్, 3 తెలుగు, 5 హిందీ, 1 ఉర్దూ, 2 పీ.డి, 15 సోషల్, 3 ఇంగ్లీష్, 2 ఫిజికల్ సైన్స్, 7 మ్యాథ్స్, 1 ఉర్దూ మీడియం సోషల్, 1 పీఈటీ, లాంగ్వేజ్ పండిట్ల కింద 3 తెలుగు, 2 హిందీ, సెకండ్ గ్రేట్ టీచర్లుగా 13 తెలుగు, 3 ఉర్దూ, 6 స్పెషలైజేషన్ కింద పోస్టింగ్లు ఇచ్చామని వీరికి కేటాయించిన పాఠశాలల్లో రిపోర్ట్ చేసి జాయిన్ కావాలని అన్నారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

గోదావరిఖని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేధించాలని ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే1ఇంక్లైన్ ఉద్యోగులతో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ పురోగతికి తీసుకోవాల్సిన అంశాల గురించి ఉద్యోగులకు వివరించారు. సమష్టి కృషితో బొగ్గు నాణ్యతను పెంచి ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుతూ సంస్థను ముందు తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రక్షణసూత్రాలను పాటిస్తూ బొగ్గు ఉత్పత్తిని వెలికితీయాలని, అప్పుడే సంస్థ అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని చెప్పారు. భూగర్భ గనుల్లో యంత్రాల వినియోగం 100 శాతం వినియోగించాలని రాబోయే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని, ప్రమాదరహిత సింగరేణిగా జీరో హర్మ్ సంస్థగా రక్షణ సూత్రాలను పాటించి జాగ్రత్తలు తీసుకో వాలని ఉద్యోగులకు సూచించారు.

ఈ సమావేశంలో గ్రూప్ వన్ ఏజెంట్ రమేష్, ఏరియా ఇంజనీర్ రమేష్, ఏఎస్‌వో సాయి ప్రసాద్, ఎస్‌వోఎం రమేష్, రాజన్న, రవీందర్‌రెడ్డి, ఎక్బాల్ షరీఫ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యంత్రాల నిర్వహణపై దృష్టి సారించాలి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఓసీపీ-3 లోని భారీ యంత్రాల నిర్వహణపై దృష్టి సారించాలని సీఐటీయూ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్ ప్రాజెక్టు మేనేజర్ భరత్‌కుమార్‌ను కోరారు. సీఐటీయూ అభ్యర్థన మేరకు మంగళవారం మేనేజర్ భారీ యంత్రాల పనితీరు, స్థితిని పరిశీలించారు. యంత్రాలపై విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను అడిగి వాటిలో తలెత్తుతున్న సమస్యలను తెలుసుకున్నారు. షావల్స్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాగా, యంత్రాల మెయింటనెన్స్ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని, షావల్ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'ఎస్టేట్ అధికారిపై పూర్తి నివేదికతో సీఎండీ దృష్టికి తీసుకెళ్తాం'

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎస్టేట్ అధికారి సాంబశివరావు హయాంలో సింగరేణి భూముల్లో జరిగిన ఇళ్ల నిర్మాణాలపై పూర్తి నివేదికతో సంస్థ సీఎండీని కలిసి తెలియజేస్తామని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం గోదావరిఖని కార్పొరేషన్ కార్యాలయం ముందున్న కానిస్టేబుల్ ఆర్నకొండ సదానందం ఇంటికి వెళ్ళకుండా నిర్మించిన గోడ స్థలాన్ని ఎస్‌సీ, ఎస్‌టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీసభ్యులు, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందున్న కానిస్టేబుల్ ఆర్నకొండ సదానందం ఇంటి నిర్మాణం విషయంలో ఆర్‌జీ-1 ఎస్టేట్ అధికారి సాంబశివరావు కుల వివక్షతతో ఇంట్లోకి వెళ్లకుండా గోడను నిర్మించారన్నారు. ఈ విషయమై పూర్తి నివేదికతో సీఎండీని కలిసి ఎస్టేట్, సెక్యూరిటీ విభాగాల్లో కూడా అనేక అవకతవకలు చోటు చేసుకుంటున్న విషయాలను తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 32వడివిజన్ కార్పొరేటర్ అయిత శివకుమార్, ఆలిండియా అంబేద్కర్ సంఘం నాయకులు వెంకన్న, మాదిగ జనచైతన్య సమితి జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల రమేష్ ఉన్నారు.

రేపటితో 8ఏ విషాదానికి 21 ఏళ్లు..

● గని ప్రమాదంలో 10 మంది కార్మికుల దుర్మరణం



వివరాలు తెలుసుకుంటున్న కాకా, డీఎస్‌ఆర్, ఎమ్మెస్సార్, శ్రీధర్‌బాబు(ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి చరిత్రలోనే రెండో అతిపెద్ద ప్రమాదమైన 8ఏ గని ప్రమాదానికి రేపటికి 21 ఏళ్ళు నిండనున్నాయి. గని పైకప్పు బండరాయి కూలిన ఈ ప్రమాదంలో 10మంది కార్మికులు మృత్యువాత పడ్డారు. రెండు రోజులపాటు రెస్క్యూ సిబ్బంది శ్రమకోర్చి శవాలను వెలికితీశారు. ఆర్జీ-2 పరిధి లోని 8ఏ గనిలో 2003 అక్టోబర్ 16(గురువారం) రెండో షిఫ్టు పూర్తయి నైట్‌షిఫ్టు డిస్ట్రిబ్యుషన్ అనం తరం కార్మికులు గనిలోకి వెళ్లారు. అర్ధరాత్రి 1.30 సమయంలో గనిలోని యైభైఐదున్నర లెవల్, తొమ్మిదవ డీప్ సమీపంలో పైకప్పు బండరాయి కూలింది. రెండు మీటర్ల మందం, ఆరుమీటర్ల పొడవు, వెడల్పు గల బండరాయి ఎలాంటి శబ్దం రాకుండానే కూలింది. ప్రమాద సమయంలో అక్కడ 12మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు కార్మికులు తృటిలో తప్పించుకోగా మిగిలిన పది మంది బండరాయి కింద నలిగి అక్కడికక్కడే చనిపోయారు. బండరాయిని తొలగించి శవాలను వెలికితీయడానికి రెస్క్యూ సిబ్బంది రెండు రోజుల పాటు శ్రమించాల్సి వచ్చింది. అప్పటికి సరిగ్గా నాలుగు నెలల ముందు 7ఎల్‌ఈపీలో జరిగిన జలప్రమాదంలో 17 మంది కార్మికులు మృత్యువాతపడిన ఘటన విషాదఛాయల నుంచి తేరుకోకముందే ఈప్రమాదం చోటుచేసుకోవడంతో కార్మికవర్గ తీవ్ర శోక సముద్రంలో మునిగిపోయింది. ప్రమాదవార్త తెలుసుకుని పారిశ్రామిక ప్రాంత ప్రజలు, కార్మికులు పెద్దఎత్తున గని వద్ద పడిగాపులు పడ్డారు. పదిమంది మరణించారనే వార్తతో ఒక్కసారి కోల్‌బెల్ట్ ప్రాంతంలో విషాదం అలుముకున్నది. గని ఆవరణలో శవాల కోసం నిద్రాహారాలు మాని మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులు, ప్రజలు ఎదురుచూశారు. మరణించిన కార్మిక కుటుంబీకుల హృదయవిదారక రోదనల తో మిన్నంటింది. రక్షణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని కార్మికులు, యూనియన్ల నాయకులు యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ప్రమాద ఘటనతో రాష్ట్ర ప్రభుత్వం కలదిలింది. అప్పటి బొగ్గుశాఖ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మొదలు ఎంపీ సుగుణకుమారి, కాంగ్రెస్ నాయకులు కాకా, డీశ్రీనివాస్, శ్రీధర్‌బాబు, జీవన్ రెడ్డి, టీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, పౌరహక్కుల నేత బాలగోపాల్ వంటి ప్రముఖులు 8ఏ గనికి చేరుకుని ప్రమాద ఘటనపై ఆరా తీశారు. మృతుల కుటుంబాలను కలిసి సంతాపాన్ని ప్రకటించారు. రక్షణ చర్యల్లో లోపం కారణంగానే ప్రమాదం జరిగిందని యాజమాన్య వైఖరిని తప్పుబట్టారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 10మంది కార్మికుల మృతికి చిహ్నంగా 8ఏ సమీపంలో కార్మికసంఘాలు స్థూపాన్ని నిర్మించాయి. ప్రతి ఏడాది అక్టోబర్ 17న మృతులకు నివాళులు అర్పిస్తున్నారు.

ప్రమాదంలో మరణించిన కార్మికులు

లంబు మల్లయ్య(మైనింగ్ సర్దార్), మామిడి మల్లేష్(టింబర్‌మెన్), మీనుగు చంద్రయ్య(కోల్‌కట్టర్), మంథని రాజం(టింబర్‌మెన్), కన్నూరి రాయమల్లు(కోల్‌ఫిల్లర్), రాగుల నర్సింగరావు (కోల్‌ఫిల్లర్), అడప అశోక్(కోల్‌కట్టర్), పిడుగు కొంరయ్య(టింబర్‌మెన్), కాశెట్టి నారాయణ(కోల్ ఫిల్లర్), తోట బాపు(కోల్‌ఫిల్లర్).

రేపటి నుంచి జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు



మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రెస్క్యూ జోనల్ స్థాయి పోటీలను ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్నట్లు సింగరేణి జీఎం సేఫ్టీ చింతల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రెస్క్యూ స్టేషన్ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో సింగరేణి రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణలతో కలిసి ఆయన మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో సింగరేణి వ్యాప్తంగా ఆరు జట్లు పాల్గొంటాయని తెలిపారు. రెస్క్యూ బృంద సభ్యుల నైపుణ్యాన్ని పెంపొ ందించడం, విపత్కర పరిస్థితులు, ప్రమాదాలు సంభవించినపుడు కార్మికులను, సంస్థ ఆస్తులను కాపాడడంలో మెళకువలు నేర్చు కోవడం ప్రధాన ఉద్దేశంతో పోటీలను నిర్వహిస్తున్నట్టు జీఎం తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లకు రెస్క్యూ రిలే, ఫస్ట్ ఎయిడ్, అండర్ గ్రౌండ్ లో రెస్క్యూ రిలే, రెస్క్యూ రికవరీ, డ్రిల్ అండ్ పరేడ్, రెస్క్యూ అండ్ రికవరీ అంశాలపై పోటీలు ఉంటాయని చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. రెస్క్యూ స్టేషన్ ఆవరణలో, 7ఎల్‌ఈపీ గనిలో పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆర్జీ-1 జట్టు, ఆర్జీ-2,3 ఏపీఏ ఒక జట్టు, శ్రీరాంపూర్ ఏరియా జట్టు, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాలు కలిసి ఒక జట్టు, భూపాలపల్లి జట్టు, కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు ఏరియాలు కలిసి ఒక జట్టుగా పోటీల్లో పాల్గొననున్నాయని సేఫ్టీ జీఎం తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిలో 16 మందిని ఎంపిక చేసి డిసెంబర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నట్టు చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సీఎండీ బలరాం, డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ భూషణ్‌ప్రసాద్ సింగ్‌తో పాటు డీఎంఎస్, డీడీఎంఎస్ అధికారులు హాజరు కానున్నట్టు ఆయన పేర్కొన్నారు. రెస్క్యూ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు జీఎం శ్రీనివాస్ తెలిపారు.

ఈ విలేకరుల సమావేశంలో వీకేపీ గ్రూప్ ఏజెంట్ నెహ్రూ, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, అధికారులు ఎర్రన్న, మురళీకృష్ణ, ధనుంజయ, విజయ్‌కుమార్, డాక్టర్ మహిపాల్ పాల్గొన్నారు.

వాహన టెండర్లపై భూనిర్వాతుల ఫిర్యాదు

రామగిరి అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 డివిజన్ పరిధిలో సింగరేణి వాహన టెండర్లలో గోల్‌మాల్ జరుగుతోందని భూనిర్వాసితులైన బాధితులు పొన్నం బాలక్రిష్ణ, మేడగోని నరెందర్‌లు మంగళవారం సెంటినరీకాలనీలో విలేకరులతో అవేదన వ్యక్తం చేశారు. ఆర్జీ-3 డివిజన్ పరిధిలో జీఎం సుధాకర్‌రావు, పర్చేజ్ అధికారి ఈమని నాగేశ్వర్‌రావులు భూనిర్వాసితుల వాహనాల టెండర్లలో చేతివాటం ప్రదర్శిస్తున్నారని, దాంతో అర్హులను అనర్హులుగా, అనర్హులను అర్హులుగా చిత్రీకరించి నిర్వాసితులకు అన్యాయం చేస్తూ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తగిన తీసుకోవాలని సింగరేణి సీఎండీతో పాటు డైరెక్టర్ పా(చీఫ్ విజిలెన్స్ అధికారి)కి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.